www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 3 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-140 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ



- 6నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- ఆ వెంటనే తెలంగాణ భవన్‌లో లెజిస్లేచర్ పార్టీ మీటింగ్
- నేటి సమావేశాలపై సర్వత్రా ఆసక్తి
- ఏ నిర్ణయం తీసుకుంటారో అని రాకీయ వర్గాల్లో చర్చలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** టిఆర్ఎస్‌లో ఏం జరుగుతుందనే చర్చ ఇప్పుడు సర్వత్రా వినిపిస్తోంది. శనివారం జరిగే కేబినేట్ భేటీ, తరవాత పార్టీ లెజిస్లేచర్ సమావేశంపై ఇప్పుడు చర్చ సాగుతోంది. ఉదయం ప్రగతి భవన్లోఓ కెసిఆర్ అధ్యక్షతన కేబినేట్ భేటీ ఉంటుంది. అలాగే సాయంత్రం తెలంగాణ భవన్‌లో లెజిస్లేచర్ పార్టీ మీటింగ్ ఉంటుంది. దీనికి ఎంపిలను కూడా ఆహ్వానించారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వివిధ అంశలను చర్చించే వీలుంది. ఇటీవలి బీహార్ పర్యటన, జాతీయరాజకీయాల్లో పాత్రపైనా చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే కేబినేటల్‌లో కూడా అసెంబ్లీ సమావేశాలతో పాటు అనేక అంశాలు చర్చకు రావచ్చు. అయితే కొన్ని రోజులుగా సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. టిఆర్ఎస్ నేతలు కూడా బిజెపి లక్ష్యంగా విమర్శలకు పదను పెట్టారు. దీంతో అన్నీ ఎన్నికల చుట్టే తిరుగుతున్నాయి. మొన్నటి వరకు జాతీయ రాజకీయాలు, జాతీయ పార్టీ, ప్రత్యామ్నాయ వేదిక చుట్టూ తిరిగింది కేసీఆర్ రాజకీయం. ఇప్పుడు జిల్లా పర్యటనలు, కేబినెట్ సమావేశం, టీఆర్ఎస్ ఎల్పీ నిర్వహించటం చర్చనీయాంశంగా మారింది. మునుగోడు ఉప ఎన్నికకు టైం దగ్గర పడుతున్న సందర్భంలో.. ఒకే రోజు కేబినెట్, టీఆర్ఎస్ ఎల్పీ సమావేశాలు నిర్వహిస్తుండటం ఆసక్తిగా మారింది. సీఎం కేసీఆర్ కార్యాచరణ అంతా మూనుగోడు కోసమా ..లేక ముందస్తు ఎన్నికలకు వెళ్ళే వ్యూహమా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనట్లు క్యాబినెట్ మీటింగ్ ఎజెండా.. టీఆర్ఎస్ ఎల్పీ మీటింగ్ ఎజెండా ముందే బహిర్గతపర్చటంపై అనేక అనుమానాలు

2వ




# అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్

- స్వదేశీ నైపుణ్యంతో రూపొందిన ఐఎన్ఎస్ విక్రాంత్
- దేశీయ పరిజ్ఞానానికి పెద్ద విజయంగా అభివర్ణించిన మోడీ
- కొచ్చిలో ప్రధాని చేతుల మీదుగా సముద్ర ప్రవేశం చేసిన విక్రాంత్

**కొచ్చి,సెప్టెంబర్ 2 (సమ సమాజం):** అభివృద్ధి చెందిన దేశం దిశగా మరో ముందడుగు పడిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మన దేశంలోనే డిజైన్ చేసి, నిర్మించిన తొలి విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను భారత నావికా దళానికి అప్పగించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఇలాంటి నౌకలను అభివృద్ధి చెందిన దేశాలు మాత్రమే నిర్మిస్తూ ఉండేవన్నారు. కొచ్చిన్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మోదీ ఐఎన్ఎస్ విక్రాంత్‌ను భారత నావికా దళానికి అప్పగించారు. ఛత్రపతి శివాజీ మహారాజు స్ఫూర్తితో

2వ

## కేరళ వేదికగా నేడు దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సిఎంల భేటీ
- నేటి భేటీకి దూరంగా తెలంగాణ సిఎం కెసిఆర్
- హాజరవుతున్న తెలంగాణ హోంమంత్రి మహ్మూద్ అలీ



**హైదరాబాద్,సెప్టెంబర్ 2 (సమ సమాజం):** కేరళ వేదికగా శనివారం దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం జరుగనుంది. తిరువనంతరపురం వేదికగా కౌన్సిల్ 30వ సమావేశం జరగనుంది. అమిత్ షా అధ్యక్షతన దక్షిణాది రాస్ట్రాల సిఎంలు పాల్గొంటారు. ఇందులో రాష్ట్ర వాదనలు బలంగా వినిపించాలని సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో సమావేశం జరగనుంది. ఈ

2వ

## ఆయుష్మాన్ భారత్‌లో చేరలేదంటూ అబద్ధాలా

- చేరినట్లు గుర్తిస్తే రాజీనామా చేస్తారా మేడమ్
- ప్రధాని మోడీ ఫోటో పెట్ట లేదని రగడ చేస్తారా
- తెలంగాణ నుంచి ఎన్ని నిధులు వెళుతున్నాయో తెలుసా
- రాజకీయాలు చేయడం తప్ప మరోటి తెలియని నిర్మలమ్మ
- విమర్శలపై ఘాటుగా స్పందించిన మంత్రి హరీష్ రావు




**మెదక్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** తెలంగాన పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలంగాణ ఆర్థిక మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ చేరలేదన్న వ్యాఖ్యలు అబద్ధమైతే రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. తనపర్యటనలో కేసీఆర్ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. దీంతో ఆర్థిక మంత్రికి కౌంటర్ ఇస్తూ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. తూప్రాన్‌లో మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రధాని మాటలను దిగజార్చేలా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. కేంద్రమంత్రలు నోరు విప్పితే అన్ని అబద్దాలే. బీజేపీ దిక్కుమాలిన రాజకీయాలు చేస్తోంది. పేదలకు మేము ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తున్నాము. దేశాన్ని సాకే ఐదారు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ చేరలేదని నిరూపిస్తే.. నేను రాజీనామా చేస్తాను. చేరిన్లైతే నిర్మలా సీతారామన్ రాజీనామా చేస్తారా? అని కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేసిన ఘనత కేసీఆర్‌దేనని నిర్మల ఎద్దేవా చేశారు. తెలంగాణలో ప్రతీ శిశువుపై రూ. 1.25 లక్షల అప్పు ఉంది. తెలంగాణలో అప్పుడే పుట్టిన బిడ్డ కూడా లక్ష రూపాయల అప్పు కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధికి మించి తెలంగాణ అప్పులు చేసింది. కేంద్రం నిధులిచ్చినా కేసీఆర్ బద్నాం చేస్తున్నారు. ఉపాధీ హామీ పథకం కోసం కేంద్రం రూ.20 వేల కోట్లు ఇచ్చింది. ఉపాధి హామీ పథకం సర్వే కోసం అధికారులు వచ్చారు. మేం పంపిన డబ్బులు ఖర్చు చేయకపోతే అధికారులు విచారణ చేస్తారు.

2వ

## కేంద్రం ఇస్తున్న ఉచిత రేషన్‌పై ప్రజలకు ఎందుకు చెప్పలేదు

- రేషన్‌లో కనీసం కేంద్రం వాటా ఎంతో చెప్పండి
- కామారెడ్డి కలెక్టర్‌ను నిలదీసిన కేంద్రమంత్రి నిర్మల
- రెండోరోజు పర్యటనలో బిజీగా జిల్లాలో ఆర్థికమంత్రి



**కామారెడ్డి, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం ఇస్తోంది కదా.. ఈ విషయాన్ని ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని కామారెడ్డి కలెక్టర్ జితేష్ పటేల్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రశ్నించారు. రేషన్ షాపులో మోడీ ఫోటో ఎందుకు పెట్టలేదంటూ కలెక్టర్ జితేష్ పటేల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు కామారెడ్డిలో పర్యటిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ జిల్లా కలెక్టర్ జితేష్ పటేల్‌కు క్లాస్ పీకారు. బీర్కూర్‌లో రేషన్ షాపును సందర్శించిన ఆమె కలెక్టర్ పై ప్రశ్నలు కురిపించారు. రేషన్ బియ్యంలో కేంద్రం వాటా ఎంత అని అడిగితే.. దీనికి కలెక్టర్ సమాధానం చెప్పలేకపోయారు. అయితే అరగంట టైం తీసుకొని సమాధానం చెప్పాలంటూ కలెక్టర్ జితేష్ పటేల్ పై నిర్మలా సీతారామన్ సీరియస్ అయ్యారు. ఇదిలావుంటే ఉదయం కాంగ్రెస్ నేతలు కేంద్రమంత్రి కాన్వాయ్ ను అడ్డుకునేందుకు యత్నించారు.

2వ

## ప్రారంభానికి సిద్దంగా బిసి గురుకులాలు

వెల్లడించిన మంత్రి గంగుల కమలాకర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ బీసీల కోసం కేటాయించిన నూతన గురుకులాలు, డిగ్రీ కాలేజీల ప్రారంభానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. జిల్లాకు ఒకటి చొప్పున 33 నూతన గురుకులాలు అక్టోబర్ 11 నుంచి, నూతన డిగ్రీ కళాశాలలను అక్టోబర్ 15 నుంచి ప్రారంభించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు.

2వ

## వైఎస్ మరణం ప్రజలకు తీరని లోటు

వైఎస్ సంక్షేమ ప్రదాత అన్న కాంగ్రెస్

ఘనంగా నివాళి అర్పించిన పలువురు నేతలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** వైఎస్ రాజశేఖర్ రెడ్డి దీర్ఘకాలం ప్రజాజీవితంలో ఉన్న మహా నాయకులు అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..

2వ

## 6నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

ప్రకటన విడుదల చేసిన అసెంబ్లీ కార్యదర్శి

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** ఈ నెల 6 నుంచి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. వర్షాకాల సమావేశాలను నిర్వహించాలన ఇప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు 6 వ తేదీ ఉదయం 11.30 కు సెషన్ మొదలు

2వ

## సంపాదకీయం

# సైద్ధాంతిక నిబద్ధత లేని పార్టీలు !

జాతీయ పార్టీల్లో కమ్యూనిస్టు, భారతీయజనతాపార్టీ మాత్రమే సిద్ధాంతపరమైన భావజాలంతో కొనసాగు తున్నాయి. వాటికంటూ ఓ నిబద్దత ఉంది. అలా దేశంలోని ఏ ఇతర పార్టీకి అలాంటి దండలో దారంలాగా సూత్రీకరణ లేదు. అందుకే ఈ పార్టీలు సిద్దాంతపరంగా నిలిచి గెలుస్తాయి. భారతీయ జనతా పార్టీకి ఒక సిద్దాంతం ఉంది. అందులో నేతలు ఎవరైనా దాని చుట్టూ తిరగడం వల్లనే అందులోని నాయకులు పెద్దగా బయటకు పోయిన దాఖలాలు లేవు. పోయినా తక్కువమందే. వారంతా సిద్ధాంతాలతో ఉన్నావారు కాదు. అంతకు ముందు జనసంఘ్ కానీ ఎంత దుస్థితిలో ఉన్నా, ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా నేతలు తమ పార్టీని విడిచిపెట్టిన దాఖలాలు లేవు. ఓడిపోయిన కొద్దీ మరింత సమరోత్సాహంతో ఆ పార్టీ నేతలు పోరాడు తూనే వస్తున్నారు. కనుకనే ఇవాళ అది అధికారంలో పాతుకుపోతోంది. ఇందుకు ప్రధాన కారణం ఆ పార్టీ తన సైద్దాంతిక పునాదిని పటిష్ఠంగా ఉంచుకునే ప్రయత్న చేయడమే. కమ్యూనిస్టు పార్టీలు కూడా లెక్కలేన న్ని సార్లు ఎన్నికల్లో ఓడిపోయాయారు. 2004 తర్వాత నుంచి ఆ పార్టీల సంఖ్యాబలం పడిపోతూనే ఉంది. అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయారు. కేరళలో మాత్రమే ఇప్పుడు అధికారంలో ఉన్నారు. అయినా వారు వెరవకుండా మళ్లీ నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. అయినా ఆ పార్టీల నేతలు తమ పార్టీని వదిలిపెట్టి వెళ్లారన్న వార్తలు చాలా తక్కువ సందర్భాల్లో మనకు వినపడతాయి. ఎక్కడో కొద్దిమంది తప్ప కమ్యూనిస్టులు కూడా బలమైన భావజాలంతో ముందుకు సాగుతారు. అవసరమైతే వారంతా ఒక్కటి కాగలరు. కానీ కాంగ్రెస్ పార్టీలో అలా కనిపించు. కేవలం పదవీ లాలస తప్ప అందులో పార్టీ సిద్దాంతాల రాద్దాంతం లేదు. అధికారంలో కోల్పోతే చాలు ఆ పార్టీ నేతలు తమ పార్టీ నాయకత్వాన్ని దూషించి ఇతర పార్టీల్లోకి దుంకేస్తారు. ఒకప్పుడు ఇందిర,రాజీవ్ హయాంలో పార్టీకి కొంత ఆకర్శణశక్తి కూడా ఉండేది. నెహ్రూ కుటుంబం అన్న బంధం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఎందుకంటే సోనియా తరం దాదాపుగా ముగిసినట్లుగానే చెప్పుకోవాలి. రాహుల్, ప్రియాంకలు పార్టీని గట్టెక్కించే సత్తా లేదని నిరూపితం అయ్యింది. అందుకే ఇక్కడ ఉన్న నేతలు ఇతర పార్టీలోకి వెళ్లి పబ్బం గడుపుకోవాలని లేదా ఇతర ప్రలోభాలకు లోబడి నిర్ణయాలు తీసుకుంటున్నారు. తమకు అధికారం లేకపోతే చాలు అసమ్మతి వాదులుగా తయారవుతారు. ఇటీవల ఆ పార్టీలో ఉన్న సీనియర్లు ఒక్కక్కరుగా బయటకు వస్తున్న తీరు చూస్తుంటే సిద్దాంతపరమైన బంధం లేకపోవడమే కారణంగా చూడాలి. వారిని కలిపి ఉంచేది అధికారమే తప్ప మరోటి కాదు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా పార్టీ నేతలు తమకు ఎప్పుడు ఏది అవసరమో అది మాత్రమే చేస్తారు. కాబట్టే కపిల్ సిబల్ వెళ్లి పోయారు. అంతకుముందు జ్యోతిరాదిత్య సింధియా వెళ్లారు. సచిన్ పైలట్ వెళ్లబోతూ ఆగారు. ఇప్పుడు ఆజాద్ కూడా వెళ్లి పోయారు. వీరంతా కూడా కేవలం రాజ్యసభ పదవులో లేదా బయట స్వలాభం ఉండో వెళ్లారే తప్ప సిద్ధాంతపరమైన విభేదాలతో కాదని గుర్తించాలి. నిజానికి చెప్పాలంటే ఆజాద్ ఒకప్పటి ఛోటా మోటా నాయకుడు. 1973లో కశ్మీర్‌లో బ్లాక్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచే ఢిల్లీలో పార్టీ నేతల చుట్టూ తిరగడం ద్వారా రాజకీయాన్ని బాగా వంటబట్టించుకున్నారు. లౌకికవాదం, మైనారిటీల ప్రయోజనాలను సంరక్షించడంలో కాంగ్రెస్ ఒకప్పుడు నిబద్ధత చూపేది. అయితే ఆజాద్ మాత్రం బయట పరిస్థితులను ఆధారంగా చేసుకుని పదవులు పొందారు! ఎమర్జెన్సీలో సంజయ్ గాంధీ భజన చేయడం ఆయనకు ఉపయోగపడింది. ముస్లింలను కాంగ్రెస్ వైపుకు తిప్పుకోవడం కోసం మైనారిటీల సదస్సు నిర్వహించమనే సలహాతో సంజయ్ దృష్టిలో పడ్డారు. ఆ తరువాత తానే యువజన కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. సొంత రాష్ట్రమైన కశ్మీర్‌లో ఆజాద్ గెలిచే అవకాశాలు పూర్తిగా కొరవడ్డాయి. దీంతో సంజయ్ అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంతూలేపై ఒత్తిడి చేసి 1980లో వాషిం నియోజకవర్గం నుంచి ఆజాద్‌ను లోక్‌సభకు నిలబెట్టి గెలిపించారు. అప్పటి నుంచీ ఆయనకు తిరుగులేకుండా పోయింది. రెండుసార్లు లోక్‌సభకు, అయిదుసార్లు రాజ్యసభకు ఎన్నిక య్యారు. ఎన్నో కేంద్రమంత్రి పదవులు, ఒకసారి జమ్మూ- కశ్మీర్ ముఖ్యమంత్రి పదవి నిర్వహించారు. 52 ఏళ్ల రాజకీయ జీవనంలో 50 ఏళ్లు ఆయన కాంగ్రెస్‌లో ఏదో ఒక పదవి నిర్వహిస్తూ వచ్చారు. కీలకమైన పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడుగా కొన్ని దశాబ్దాలుగా కొనసాగారు. ఇప్పుడు రాజ్యసభకు తనను తిరిగి ఎంపిక చేసే అవకాశం లేకపోయేసరికి కాంగ్రెస్ పనికి రాని పార్టీ అనిపించి, బయటకు వచ్చారు. అలాగే కపిల్ సిబల్ సమాజ్‌వాదీతో జతకట్టి రాజ్యసభ పొందారు. జ్యోతిరాదిత్య కూడా బిజెపిలో చేరి కేంద్రమంత్రి అయ్యారు. ఇప్పుడున్న నేతలక కూడా పదవులు ఇవ్వకుంటే వారు కూడా వెళ్లి పోవడం ఖాయం. అయితే కాంగ్రెస్ పార్టీకి రాహుల్ పనికిరాడన్న ప్రకటనే ఆ పార్టీని దెబ్బతీసేలా ఉంది. బిజెపికన్నా ముందు రెండు పర్యాయాలు కాంగ్రెస్ కేంద్రంలో అధికరాంలో ఉంది. అంతా సోనియా కనుసన్నల్లోనే వ్యవహారాలు సాగాయి. ఎన్నికల్లో పరాజయం పొందడం అన్నది సాధారణ విషయం. అంతదానకే వీరంతా కాంగ్రెస్ చేసిన పాపమంటూ బయటకు రావడం స్వార్థ రాజకీయాలు తప్ప మరోటి కాదు.ఒక రాజకీయ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడం, గెలుపొందడం అన్నది సర్వసాధారణ విషయం. ఇవాళ అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఈ స్థాయికి రావడానికి ఎన్నో ఏళ్లు పట్టింది. బిజెపి పూర్వరూపమైన జనసంఘ్ 1952 ఎన్నికల్లో కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది. 1957లో అటల్ బిహారీ వాజపేయి మూడు సీట్లకు పోటీ చేస్తే రెండు సీట్లలో ఓడిపోయారు. పడుతూ లేస్తూ వస్తూనే జనసంఘ్ ఎమ్జ్జగ్గ÷న్సీ తర్వాత 1977లో జరిగిన ఎన్నికల్లో 93 సీట్లను గెలుచుకుంది. ఇదే జనసంఘ్ 1980లో బిజెపిగా రూపాంతరం చెందినప్పటికీ 1984లో ఇందిర మరణానంతరం వెలువడిన సానుభూతి పవనాలకు తట్టుకోలేక కేవలం రెండు సీట్లు మాత్రమే గెలుచుకుంది. బిజెపి తొలి అధ్యక్షుడైన వాజపేయి కూడా గ్వాలియర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. బిజెపి వైఫల్యానికి పార్టీ అధ్యక్షుడుగా తాను బాధ్యత వహించి రాజీనామా చేస్తానని అటల్‌జీ అన్నప్పటికీ పార్టీ ఒప్పుకోలేదు. కానీ రెండు సంవత్సరాల తర్వాత జరిగిన జాతీయమండలి ప్లీనరీలో వాజపేయి తప్పుకుని అద్వాణీని అధ్యక్షుడుగా ఎన్నుకునేందుకు మార్గం సుగమం చేశారు. ఒకప్పుడు కేవలం రెండు సీట్లు గెలుచుకున్న బిజెపి 1989లో 86 సీట్లు గెలుచుకున్న తర్వాత దినదిన ప్రవర్ధమా నమవుతూ వచ్చింది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగల దశ నుంచి పూర్తి మెజారిటీ సాధించగల స్థాయికి బిజెపి చేరుకుంది. చివరకు నరేంద్ర మోదీ సారథ్యంలో రెండుసార్లు లోక్‌సభలో ఘన విజయం సాధించడమే కాక, దేశంలో అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి రాగలిగింది. ఇదంతా సైద్దాంతిక ప్రాతిపదికన మాత్రమే జరిగింది. కాంగ్రెస్‌లో సైద్దాంతికత లేకపోవడం వల్లనే నేతలు పార్టీని వీడుతున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే వీరంత లెంపలు వేసుకుని వెనక్కి వస్తారు.

**పృధ్వీరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# ప్రారంభానికి సిద్ధంగా బిసి గురుకులాలు

(మొదటి పేజీ తరువాయి) శుక్రవారం గురుకులాలు, డిగ్రీ కళాశాల ఏర్పాటుపై మంత్రి తన నివాసంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యున్నత స్థాయి ప్రమాణాలతో వీటిని నెలకొల్పుతున్నామని, స్థలాల గుర్తింపు బాధ్యతను స్థానిక జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గతంలో సీఎం హామినిచ్చిన విధంగా హాలియా, దేవరకద్ర, కరీంనగర్, సిరిసిల్ల, వనపర్తితో పాటు పాత జిల్లాల ప్రతిపాదికగా ప్రతి జిల్లాలో డిగ్రీ కాలేజీలను ప్రారంభించాలన్నారు. ఈ నూతన గురుకులాలతో మొత్తం బీసీ గురుకులాల సంఖ్య 310కి చేరింది. ఇప్పటికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 41 కులసంఘాలకు 95.25కోట్లు, కోకాపేట, ఉప్పల్ బగాయత్‌లో వేల కోట్ల విలువైన 87.3 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. వీటిలో 24 కుల సంఘాలు ఇప్పటికే ఏకగ్రీవమై పట్టాలు పొందాయన్నారు. మిగతా సంఘాల్లో సైతం ఏకగ్రీవాలు జరుగుతున్నాయని, ఇలా ఏకసంఘంగా ఏర్పడి ఆత్మగౌరవ భవనాలు నిర్మించుకునే వారికి ఈ నెల 8న పట్టాలను ప్రధానం చేసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భర్తీ చేస్తున్న 80,025 ప్రభుత్వ ఉద్యోగాల కోసం తెలంగాణ బీసీ స్టడీ సర్కిళ్లు మరింత విస్తృతంగా అభ్యర్థులకు సేవలు అందించాలని మంత్రి గంగుల అధికారులను ఆదేశించారు. 12 స్టడీ సర్కిళ్లకు అదనంగా అతి త్వరలో మరో 50 స్టడీ సెంటర్ల ద్వారా గ్రూప్స్, డీఎస్సీ, తదితర పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. వీటి ద్వారా దాదాపు 25వేల మందికి పైగా నేరుగా లబ్ధీ చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎంజేపీ సొసైటీ సెక్రటరీ మల్లయ్యబట్టు, బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ అలోక్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సంధ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ మరణం ప్రజలకు తీరని లోటు

(మొదటి పేజీ తరువాయి) వైఎస్ మరణం ఒక్క కాంగ్రెస్ పార్టీ కే కాదు తెలుగు ప్రజలందరికీ తీరనిలోటన్నారు. వైఎస్సార్ భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని తెలిపారు. ఇందిరమ్మ తర్వాత పేద ప్రజలకు అంతటి సంక్షేమ పథకాలు అందించిన మహా నేత రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఆరోగ్య శ్రీ, ఫీజ్ రీఎంబెర్స్ మెంట్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్ల లాంటి పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని రేవంత్ రెడ్డి అన్నారు. సంక్షేమ స్ఫూర్తి దాత వైఎస్సార్ అని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, పంజాగుట్ట సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పుష్పగుచ్ఛములుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, పెట్టుబడులు ఇలా అన్నింటికి ప్రాధాన్యత ఇచ్చిన వ్యక్తి రాజశేఖర్ రెడ్డని కొనియాడారు. కానీ ఇప్పటి ప్రభుత్వాలు అప్పులకు ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు పునాదులు వేయడానికి వైఎస్సార్ అత్యధికంగా ఖర్చు చేశారన్నారు. పెన్షన్లు, ఆరోగ్య శ్రీ, ఇందిరమ్మ ఇళ్లు ఇవన్నీ వైఎస్సార్‌ను గుర్తు చేస్తాయన్నారు. వైఎస్సార్‌ను ఈ రాష్ట్రం, ఈ దేశం మరవదన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనేది వైఎస్సార్ కల అని పొన్నాల లక్ష్మయ్య ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# ఆయుష్మాన్ భారత్‌లో చేరలేదంటూ అబద్ధాలా



(మొదటి పేజీ తరువాయి) సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అప్పుల గురించి అడిగే అధికారం కేంద్రానికి ఉంది అంటూ ఆమె ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ చేరలేదని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పచ్చి అబద్దాలు చెప్పారని మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా ఓ కేంద్రమంత్రే ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ చేరిందని సమాధానం చెప్పారని గుర్తు చేశారు. ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ చేరలేదని నిరూపిస్తే ఇప్పుడే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అబద్దాలు చెప్పే కేంద్రమంత్రుల జాబితాలో నిర్మలా సీతారామన్ కూడా చేరిపోయారని చురకలంటించారు. తెలంగాణ ప్రజలకు అబద్దాలు చెప్పిన నిర్మలా సీతారామన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీ గొప్పపథకమన్నారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వం రూ. 10 లక్షల వరకు ఖర్చు చేస్తోందని తెలిపారు. రేషన్ షాప్ వద్ద ప్రధానమంత్రి ఫోటో ఏర్పాటు చేయాలని ప్రధాని స్థాయిని దిగజార్చే విధంగా నిర్మల సీతారామన్ ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. గోబెల్స్ ప్రచారం చేయడంలో బీజేపీ ప్రభుత్వానికి నోబెల్ బహుమతి ఇవ్వాలని మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ పై ఢిల్లీలో ఓ కేంద్ర మంత్రి నిజం చెప్తే..గల్లీలో మరో కేంద్రమంత్రి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్?లో చేరకపోతే ఈ పథకం కింద గతేడాది రూ. 150 కోట్లు , ఈ ఏడాది ఫస్ట్ హాఫ్ కింద మరో రూ. 43 కోట్లు ఎందుకు మంజూరు చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఇప్పటి వరకు ఆయుష్మాన్ భారత్ కింద రూ. 505 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చే నిధుల కంటే..తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్లే నిధులే ఎక్కువన్నారు. ఇప్పటి వరకు కేంద్రానికి తెలంగాణ.. రూ. లక్షా 70 వేల కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ డబ్బులను ఇతర రాష్ట్రాల్లో ఖర్చు చేస్తున్నారని చెప్పారు. దేశాన్ని సాదే ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి తెలిపారు. అటు ఉచిత బియ్యంపై బీజేపీ నేతలు మాట్లాడుతున్నవి అన్నీ అబద్దాలేనని మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో పేదలకు 10 కేజీల ఉచిత బియ్యం తెలంగాణ ప్రభుత్వమే ఇస్తోందని తెలిపారు. ఉచిత బియ్యం కోసం ప్రభుత్వం ఏడాదికి రూ. 3,610 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. వరంగల్ సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పచ్చి అబద్దాలు మాట్లాడారని మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు అతీగతీ లేదన్నారని విమర్శించారు. కానీ వరంగల్ హెల్త్ సిటీ పనులు అద్భుతంగా జరుగుతున్నాయని..ఇప్పటికే 15 శాతం పనులు పూర్తయ్యాయని స్పష్టం చేశారు. అటు కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదని అమిత్ షా చెప్తున్నారని..కాళేశ్వరంతో సాగునీరిచ్చామో లేదో..ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలను అడిగితే చెప్తారన్నారు. కాళేశ్వరం గ్రోత్ ఇంజన్ ఆఫ్ తెలంగాణ అని కేంద్రమంత్రి గడ్కరే చెప్పారని గుర్తు చేశారు. మీడియా సమావేశంలో ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ఇస్తున్న ఉచిత రేషన్‌పై ప్రజలకు ఎందుకు చెప్పలేదు



(మొదటి పేజీ తరువాయి) కాన్వాయ్ కు ఎదురుగా వెళ్లేందుకు యత్నించడంతో కాంగ్రెస్ నేతలను బీజేపీ లీడర్లు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. కర్రలతో దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. రంగంలోకి దిగిన పోలీసులు రెండు పార్టీల నేతలను అక్కడి నుంచి పంపించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా కోటగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ సందర్శించారు. వాక్సినేషన్ జరుగుతున్న తీరుపై సిబ్బందితో చర్చించారు. కోవిడ్ మహమ్మారి ప్రబలిన సమయంలో మొత్తం ప్రపంచమంతా భయంతో వణికిపోతున్న సమయంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వారి సేవలు మరువలేనివని కేంద్ర మంత్రి ప్రశంసించారు. వ్యాక్సిన్ వచ్చిన వెంటనే పొలాల్లోకి వెళ్లి మరి వాక్సినేషన్ చేసారని గుర్తు చేసుకున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో జహిరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ బిజెపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులతో కలసి ఆమె సమావేశంలో పాల్గొన్నారు. కార్యకర్తల పరిస్థితిని, పార్టీ గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన పర్యటనలో భాగంగా రెండోరోజు పర్యటన కొనసాగింది. శుక్రవారం ఉదయం బాన్సువాడకు చేరుకున్న కేంద్రమంత్రి మండలంలోని కొయ్యగుట్ట అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఆపై బాన్సువాడ పట్టణంలోని బీజేపీ కార్యకర్త తుప్తి ప్రసాద్ ఇంట్లో నిర్మల సీతారామన్ అల్పాహారం చేశారు. లోక్‌సభ ప్రవాస్ యోజనలో భాగంగా బాన్సువాడ నియోజకవర్గంలో కేంద్రమంత్రి పర్యటిస్తున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో రేషన్ షాప్‌కు వెళ్లి లబ్దిదారులతో మాట్లాడారు. అనంతరం కోటగిరి వెళ్లి వాక్సినేషన్ సెంటర్‌ను పరిశీలించారు. రుద్రుర్‌లో ప్రజా ప్రతినిధుల సమావేశం .. తరువాత వర్ని మండల కేంద్రంలో ఐటీ వింగ్‌తో సమావేశంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు.

# 6నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు


కానుంది. అటు శాసన మండలి సమావేశాలు కూడా అదే రోజు ప్రారంభం అవుతాయని అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలనే దానిపై మొదటి రోజు జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. వివిధ అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగనుంది.మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక జరుగుతున్న వేళ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం హాట్ టాపిక్ అవుతోంది. మునుగోడు ఉప ఎన్నికకు టైం దగ్గర పడుతున్న సందర్భంలో.. శనివారం ఒకే రోజు కేబినెట్, టీఆర్ఎస్ ఎల్పీ సమావేశాలు నిర్వహిస్తుండటం ఆసక్తికరంగా మారింది. సీఎం కేసీఆర్ కార్యాచరణ అంతా మునుగోడు కోసమా లేక ముందస్తు ఎన్నికలకు వెళ్ళే వ్యూహమా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఈ సమావేశాల్లో ఏ అంశాలు చర్చిస్తారనే చర్చ జరుగుతోంది.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటి



(మొదటి పేజీ తరువాయి) ముందే ఈ అంశాలపై చర్చిస్తామని చర్చ జరుగుతోంది. జరుగుతున్న పరిణామాలు వేరుగా ఉండటంతో ఈ సమావేశాల్లో ఏ అంశాలు చర్చిస్తారనే చర్చ జరుగుతోంది. మునుగోడు ఉప ఎన్నిక విషయంలో ఇప్పటికే టీఆర్ఎస్ కసరత్తు మొదలుపెట్టింది. అయితే ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో అనూహ్యంగా తన కుటుంబ సభ్యుల పాత్రపై ఆరోపణలు రావటంతో కేసీఆర్ డైలమాలో పడ్డట్లు చర్చ జరుగుతోంది. మునుగోడుకు ముందే ప్రభుత్వ రద్దు దిశగా ఆలోచన చేస్తారా అనే చర్చ కూడా జరుగుతోంది. కేబినెట్ మీటింగ్, టీఆర్ఎస్ ఎల్పీ మీటింగ్ ల ద్వారా పార్టీ నేతలను మానసికంగా ప్రిపేర్ చేసే పని పెట్టుకున్నారా అనే టాక్ నడుస్తోంది. కేసీఆర్ కు సెప్టెంబర్ సెంటిమెంట్ కూడా ఉండటంతో జరుగుతున్న చర్చలకు బలం చేకూరుతుంది. 2018 సెప్టెంబర్ 6న ప్రభుత్వాన్ని రద్దు చేశారు. అది కలిసి వచ్చింది. ఇప్పుడు సెప్టెంబర్ లో ఏదైనా నిర్ణయం తీసుకుంటారా అనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ కవితపై అవినీతి ఆరోపణలు.. మున్ముందు ఎక్కడికి దారితీస్తాయో అన్న చర్చ ప్రగతిభవన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ ముదరకముందే ఎన్నికలకు వెళ్తే ఎట్లా ఉంటుందనే విషయంపై రకారకాల చర్చలు జరుగుతున్నాయి. సీఎం కేసీఆర్ అనుకున్నదానికి.. భిన్నంగా వ్యవహారాలన్నీ జరుగుతుండటంతో ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి కూడా పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. సెప్టెంబర్ 3వ తేదీన రాష్ట్ర కేబినెట్ భేటీ అయిన వెంటనే టీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారని, పైగా ఆ సమావేశానికి ఎమ్మెల్యేలతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలను కూడా ఆహ్వానించారని అంటున్నారు. సెప్టెంబర్ 3న అసెంబ్లీ రద్దుపైన కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని కొన్ని పత్రికలు అప్పుడూ ఊహాగానాలు చేశాయి. మొత్తానికి మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యమో లేక ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగమో కానీ నేడు జరగనున్న కేబినెట్, టీఆర్ఎస్ఎల్పీ సమావేశాలు కీలకమన్నది మాత్రం అర్థమవుతోంది. ఆగస్టు చివరి వారంలో వివిధ ఉత్తరాది రాష్ట్రాల రైతు సంఘాల ప్రతినిధులతో కేసీఆర్ రోజుల తరబడి సమావేశాలు నిర్వహించారు. వారిని ప్రభుత్వ ఖర్చుతో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతాలకు పంపి, గత ఎనిమిదేళ్ళలో తాము చేసిన పనులను దేశానికి చాటే ప్రయత్నం చేశారు. రైతు సమాఖ్యల ప్రతినిధులతో భేటీలు పూర్తి అయిన రెండో రోజునే ఉత్తరాది యాత్రకు ప్లాన్ చేశారు. వినాయక చవితి పండుగను కూడా పక్కన పెట్టి ఆగస్టు 31వ తేదీన కేసీఆర్ బీహార్ వెళ్ళారు. జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టే వ్యూహంలో భాగంగా కేసీఆర్ జాతీయ పార్టీని పెడతారా లేక తెలంగాణ రాష్ట్ర సమితినే భారత రాష్ట్ర సమితిగా మారుస్తారా అన్నదింకా తేలలేదు. తాజా పరిణామాలు జాతీయ రాజకీయాల్లోకి వెళ్ళడం పక్కా అనిపిస్తోంది. బీజేపీయేతర శక్తులను ఒక్కతాటిపైకి తెచ్చే యత్నాలను పలు సందర్భాలలో వివరించారు. తాజాగా పాట్నాలో నితీశ్ కుమార్, తేజస్వీయాదవ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీజేపీయేతర పార్టీలను ఏకం చేసే బృహత్తర కార్యంలో కేసీఆర్ పాత్ర ఎలా వున్నా.. కాంగ్రెస్ పార్టీ ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తకరమైన అంశం. ఈ క్రమంలో నేటి సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎంపి ధర్మపురి అర్వింద్‌ను అడ్డుకున్న పోలీసులు



**నిజామాబాద్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ను పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో ఆయనను నిలువరించారు. పోలీసులు అడ్డుకోవడంపై ఎంపీ అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉందని, పోలీసులు ఇలా నిర్బంధించడంసరికాదని అన్నారు. ఇదిలా ఉంటే లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే అవకాశముందని పోలీసులు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా అర్వింద్ మాత్రం వెనక్కి వెళ్లేందుకు అంగీకరించలేదు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

# గురుకులాల్లో మంచి భోజనం పెట్టలేరా

### సిఎం కెసిఆర్‌కు భట్టి విక్రమార్క లేఖ

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క లేఖ రాశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని, 550 మంది విద్యార్థులకు 12 తరగతులు సరిపోతాయా అంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే పక్కా భవనాల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని, మౌళిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పేర్కొన్నారు.

# దేవుడి మెడలో నోట్ల దండ మాయం

### ఎవరు లేనిది చూసి ఎత్తుకెళ్లిన దొంగ

**సిద్దిపేట, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** దేవుడి సొమ్ము దొంగతనానికి అర్హంగా మారింది. సిద్దిపేట జిల్లా కోహెడ పోచమ్మ గుడి ఆవరణలో ప్రతిష్టించిన వినాయక విగ్రహం మెడలో నుంచి సుమారు రూ.5 వేల డబ్బుల దండా చోరీ జరిగింది. అర్థరాత్రి సమయంలో అందరూ నిద్ర పోతుండగా ఓ కేటుగాడు గణెళిషుడి మండపంలోకి ప్రవేశించాడు. ఎవరూ లేరని నిర్థారించుకున్న తర్వాత స్వామివారి మెడలో ఉన్న డబ్బుల దండను తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. విషయం తెలుసుకున్న నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మరోవైపు జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్ వీధి ధర్మశాల వద్ద వినాయకుడికి నైవేద్యంగా పెట్టిన లడ్డు చోరికి గురైంది. వినాయక భక్త బృందం దొంగను పట్టుకొని దేహశుద్ధిచేశారు. లడ్డు చోరీ చేసిన దొంగ ఓ బొర్వెల్ లో పనిచేస్తున్న నాగరాజుగా గుర్తించారు. డయల్ 100కు ఫోన్ చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని దొంగను అదుపులోకి తీసుకున్నారు

# కేరళ వేదికగా నేడు దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం



(మొదటి పేజి తరువాయి) సమావేశానికి హోంమంత్రి మహమూద్ అలీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధుల బృందం హాజరుకానుంది. విద్యుత్ బకాయిలు, విభజన సమస్యలు, నీటిపారుదల అంశాలపై దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర వాదనలు బలంగా వినిపించాలని రాష్ట్ర బృందాన్ని సీఎం కేసీఆర్ ఆదేశించారు. విద్యుత్ బకాయిలు, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు, విభజన హామీలు సమావేశంలో ప్రస్తావనకు రానున్నాయి. హోంమంత్రి మహమూద్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బృందం కౌన్సిల్ సమావేశానికి హాజరుకానుంది. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పాటు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావడం లేదు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంతోపాటు తెరాస శాసనసభా పక్ష సమావేశం సైతం ఉండడంతో సీఎం వెళ్లడం లేదు. విభజన వ్యవహారాలు చూస్తున్న ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు కౌన్సిల్ సమావేశం ఎజెండాలో ఉన్న నీటిపారుదల, విద్యుత్, హోంశాఖల నుంచి అధికారులు వెళ్లనున్నారు. విద్యుత్ బకాయిల అంశం చర్చకు రానుంది. తెలంగాణ డిస్కంల నుంచి 6700 కోట్లు రావాలని ఏపీ చెపుతుండగా ఆ మొత్తాన్ని నెల రోజుల్లోగా చెల్లించాలంటూ కేంద్ర విద్యుత్ శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఏపీ నుంచి తమకు రూ.12వేల కోట్ల విద్యుత్ బకాయిలు రావాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీంతో కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం మరోమారు ప్రస్తావనకు రానుంది. అలాగే రాష్ట్రానికి సంబంధించి నీటిపారుదల సంబంధిత అంశాలు సహా విభజన వివాదాలు, సమస్యలు సమావేశంలో ప్రస్తావనకు రానున్నాయి. విభజన చట్టానికి సంబంధించిన అంశాలు, దిల్లీలో ఏపీభవన్ విభజన, తొమ్మిది, పది షెడ్యూళ్లలోని సంస్థల విభజన, పన్నుల్లో వ్యత్యాసం, పౌరసరఫరాల సంస్థల బకాయిలు సైతం ప్రస్తావనకు రానున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన నీటిపారుదల సంబంధిత అంశాలు జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు రానున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అంశం అజెండాలో ఉంది. కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా తేల్చేందుకు ట్రిబ్యునల్‌కు నివేదించడం తోపాటు పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరే అవకాశం ఉంది. మహిళలు, చిన్నారులపై లైంగికదాడుల కేసుల సత్వర పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానాలపై కౌన్సిల్ సమావేశం చర్చించనుంది. వివిధ అంశాలకు సంబంధించి రాష్ట్రం తరపున వినిపించాల్సిన వాదనలు, ప్రస్తావించాల్సిన అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంచేశారు.

## అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్



(మొదటి పేజి తరువాయి) రూపొందించిన కొత్త నావికా దళ జెండాను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశం దిశగా మరో ముందడుగు పడిందని తెలిపారు. ఇటువంటి విమాన వాహక నౌకలను అభివృద్ధి చెందిన దేశాలు మాత్రమే నిర్మించేవన్నారు. వాటి సరసన చేరడం ద్వారా భారత దేశం కూడా అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి మరో ముందడుగు వేసిందని చెప్పారు. ఐఎన్ఎస్ విక్రాంత్ కేవలం యుద్ధ యంత్రం కాదన్నారు. భారత దేశ నైపుణ్యం, ప్రతిభలకు ఇది నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. ఇది చాలా ప్రత్యేకమైనదన్నారు. ఎన్ఎస్ విక్రాంత్‌ను రూ.20,000 కోట్లతో నిర్మించారు. ఈ నౌక నుంచి విమానాలు బయల్దేరడానికి 262 మీటర్ల పొడవు, 62.4 మీటర్ల వెడల్పుగల ఫ్లయింగ్ డెక్ ఉంది. మన దేశంలోని ప్రధాన పరిశ్రమలు, 100 ఎంఎస్ఎంఈలు సరఫరా చేసిన మెషినరీతో ఈ నౌకను నిర్మించారు. దీంతో అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్ సరసన భారత దేశం కూడా చేరింది. కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, కేరళ గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్నారు. స్వదేశీయంగా తయారైన ఐఎన్ఎస్ విక్రాంత్ భారతీయ నౌకాదళంలోకి చేరింది. ప్రధాని చేతుల మీదుగా ఆ యుద్ధ నౌకను జలప్రవేశం చేయించారు. భారతీయ నౌకాదళ చరిత్రలో గతంలో ఇంత పెద్ద యుద్ధ నౌకను స్వదేశీయంగా తయారు చేయలేదు. యుద్ధ విమానాలను మోసుకెళ్లే ఐఎన్ఎస్ విక్రాంత్‌ను నౌకాదళంలోకి చేర్చుతున్న సందర్భంగా కొచ్చిన్ షిప్‌యార్డులో గ్రాండ్ సెర్మనీ నిర్వహించారు. 45వేల టన్నుల యుద్ధ విమానాన్ని సుమారు 20 వేల కోట్ల ఖర్చుతో నిర్మించారు. విక్రాంత్ చాలా పెద్ద సైజ్‌లో ఉందని, చాలా గ్రాండ్‌గా ఉందని, చాలా విశిష్టమైందని, ఓ ప్రత్యేకమైందని ప్రధాని మోదీ అన్నారు. విక్రాంత్ కేవలం యుద్ధనౌక కాదు అని, హార్డ్‌వర్క్, ట్యాలెంట్‌కు ఇది నిదర్శనమని ఆయన అన్నారు. మారిటైమ్ జోన్‌ను ఐఎన్ఎస్ విక్రాంత్ రక్షిస్తుందని, నేవీలో ఉన్న మహిళ సైనికులు ఆ విధుల్లో చేరుతారని, అపరిమితమైన సముద్ర శక్తి, హద్దులు లేని మహిళా శక్తి.. కొత్త ఇడియాకు ఐడెంటీగా మారుతుందని ప్రధాని అన్నారు. ఇదిలావుంటే దేశీయంగా తయారైన తొలి ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక నౌకా దళంలోకి చేరిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరును కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. 1999 నుంచి పలు ప్రభుత్వాల సమిష్టి ప్రయత్నాలతోనే ఐఎన్ఎస్ విక్రాంత్ నౌకాదళంలోకి తీసుకురాగలిగామని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తించారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ప్రశ్నించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఐఎన్ఎస్ విక్రాంత్ నేడు నౌకా దళంలోకి ప్రవేశించడం 1999 నుంచి పలు ప్రభుత్వాలు సాగించిన సమిష్టి కృషికి ఫలితం కాదా అని ఆయన ప్రధాని మోదీని నిలదీశారు. 1971 యుద్ధంలో భారత్‌కు ఎంతో ఉపయోగపడిన అసలైన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను కూడా గుర్తుచేసుకోవాలని అన్నారు. బ్రిటన్ నుంచి దానిని తీసుకురావడంలో కృష్ణ మీనన్ కీలక పాత్ర పోషించారని జైరాం రమేష్ ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. కాగా దేశీయంగా తయారైన ఐఎన్ఎస్ విక్రాంత్ శుక్రవారం భారతీయ నౌకాదళంలోకి చేరింది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆ యుద్ధ నౌకను జలప్రవేశం చేయించారు. భారతీయ నౌకాదళ చరిత్రలో గతంలో ఇంత పెద్ద యుద్ధ నౌకను స్వదేశీయంగా తయారు చేయలేదు.

## ప్రతి గ్రామంలోనూ వైకుంఠధామాల నిర్మాణం

### వైకుంఠ రథనాన్ని ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

**మహబూబాబాద్, సెప్టెంబర్ 2 (సమ సమాజం):** చనిపోయిన వారి అంతిమ సంస్కారాలు కూడా అత్యంత గౌరవంగా సాగాలని సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారని, అందుకే గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మిస్తున్నామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా వైకుంఠధామాలను ఏర్పాటు చేశారని అన్నారు. శుక్రవారం తొర్రూరు పురపాలక సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామానికి ఒక వైకుంఠధామం ఏర్పాటు అయింది. అన్ని రకాల సదుపాయాలతో వాటిని ఏర్పాటు చేశామన్నారు. నగరాలు, పట్టణాలలో కూడా మోడల్ వైకుంఠధామాలను నిర్మించామన్నారు. ఇప్పుడు తొర్రూరు పట్టణంలో పాలక వర్గం, అధికారులు కలిసి వైకుంఠ రథం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు వైకుంఠ రథాన్ని వినియోగించుకునే విధంగా అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, కమిషనర్ బాబు, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడమే లక్ష్యం

### వెజ్,నాన్‌వెజ్ మార్కెట్ ప్రారంభించిన హరీష్ రావు




మెదక్, **సెప్టెంబర్ 2 (సమ సమాజం):** ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచి, నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలనే ఉద్దేశంతో ప్రతి మున్సిపల్ కేంద్రంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిహరీశ్ రావు అన్నారు. శుక్రవారం తూప్రాన్ మున్సిపాలిటీలో రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను నిర్మిస్తున్నదని అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మార్కెట్లో దుమ్ము, ధూళి వంటివి ఆహార పదార్థాలపై పడకుండా నాలుగు ఫీట్ల ఎత్తున స్టాల్స్ ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. త్వరలో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీనిచ్చారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, కోల్డ్ స్టోరేజీలు కూడ ఏర్పాటు చేశామని విక్రయ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. పాలు, పండ్లు, కూరగాయలు, మాంసం, చికెన్, చేపల విక్రయాలు ఈ మార్కెట్ పరిధిలోనే జరగాలన్నారు. బయట విక్రయించరాదని, ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని ఆయన కోరారు. త్వరలో ఇక్కడ బ్యాంకు, ఏటీఎం సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. మార్కెట్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎలోన్ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పురస్కారాలకు 40 మంది ఎంపిక

5న మంత్రి సబిత చేతుల మీదుగా పురస్కారాల అందచేత ● వివరాలు వెల్లడించిన విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

హైదరాబాద్, **సెప్టెంబర్ 2 (సమ సమాజం):** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 40 మంది ఎంపికయ్యారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికి సెప్టెంబర్5న హైదరాబాద్‌లో పురస్కారాలను అందజేస్తారు. రాష్ట్రంలో 2022 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 40 మంది ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు/ ప్రిన్సిపాళ్ల విభాగంలో 10 మంది, స్కూల్ అసిస్టెంట్/ పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల విభాగంలో 19 మంది, ఎస్‌జీటీ/టీజీటీలకు సంబంధించి 10 మంది, అధ్యాపకులు/ సీనియర్ అధ్యాపకుల విభాగంలో ఒకరిని ఎంపిక చేశారు. వీరితో పాటు ప్రత్యేక విభాగంలో మరో 10 మందికి పురస్కారం వరించింది. వీరందరికి ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పురస్కారాలను అందజేస్తారు. విభాగాల వారీగా ఎంపికైన వారి వివరాలివి.. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు: టి.మురళి కృష్ణమూర్తి (కౌకూరు ఉన్నత పాఠశాల, మేడ్చల్), చకినాల శ్రీనివాస్ (సిరిసిల్ల), బి.జమునాదేవి (తిర్మలాపురం, జగిత్యాల జిల్లా), ఓ.చంద్రశేఖర్ (జూకల్, జయశంకర్ జిల్లా), గోపాల్‌సింగ్ తిలావత్ (ఇంద్రవల్లి, ఆదిలాబాద్ జిల్లా), ఎస్.సురేశ్ (పాచల నడ్కుడ, నిజామాబాద్ జిల్లా), వి.రాజేందర్ (గానుగుపహాడ్, జనగామ జిల్లా), బి.చలపతిరావు (ముస్తికుంట్ల, ఖమ్మం జిల్లా), వనుపాలి నిరంజన్ (మణికొండ, రంగారెడ్డి జిల్లా), సూర సతీశ్ కుమార్ (ప్రిన్సిపాల్, సర్వేల్ గురుకులం, భువనగిరి జిల్లా) ÷-కూల్ అసిస్టెంట్/పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు: డి.సత్యప్రకాశ్ (స్టేషన్ ఘన్‌పుర్, జనగామ జిల్లా), జె.శ్రీనివాస్ (మస్కాపుర్, నిర్మల్), పి.ప్రవీణ్‌కుమార్ (చిన్న మల్లారెడ్డి హైస్కూల్, కామారెడ్డి జిల్లా), తేజావత్ మోహన్‌బాబు (బూర్గంపహాడ్, కొత్తగూడెం), ఎ.వెంకన్న (సూర్యాపేట), కన్నం అరుణ (నగునూర్, కరీంనగర్), సయ్యద్ షఫీ (ఖమ్మం), డాక్టర్ హజారే శ్రీనివాస్ (జక్రాన్‌పల్లి, నిజామాబాద్), కె.రామారావు (చిల్కూర్, సూర్యాపేట), సీహెచ్.కృష్ణ (బొల్లికుంట, వరంగల్), కె.మధుకర్ (వేంపల్లి, ఆసిఫాబాద్), ఎ.రాజశేఖర్ (వర్గల్, సిద్దిపేట), గొల్ల వెంకటేష్ (మల్దకల్, గద్వాల), కె.ధనలక్ష్మి (మొండ్రాయి, వరంగల్), కంచర్ల రాజవర్ధన్‌రెడ్డి (నార్కట్‌పల్లి మండలం, నల్గొండ), జి.గిరిజమ్మ (నారాయణపేట), జె.ఎల్లాస్వామి (అనంతపుర్, గద్వాల), సీహెచ్.భరణీకుమార్ (అడ్డగూడూర్, భువనగిరి), అంబటి శంకర్ (రుద్రాంగి, సిరిసిల్ల)ఎస్‌జీటీ/టీజీటీలు: జి.చంద్రశేఖర్ (దిలావర్‌పూర్, నిర్మల్), ఎం.వెంకటరెడ్డి (సైదాబాద్, హైదరాబాద్), పసుల ప్రతాప్ (గిమ్మ, ఆదిలాబాద్), ఉడావత్ లచ్చిరామ్ (తెరాట్‌పల్లి, నల్గొండ), కె.ప్రవీణ్ (చందపల్లి, పెద్దపల్లి), అచ్చా సుదర్శనం (చెర్లపల్లి, హనుమకొండ), టి.ఓంకార్ రాధాకృష్ణ (అంగడి కిస్టాపుర్, సిద్దిపేట), కడారి అనిత (చన్నదుపట్ల, నల్గొండ), బి.నర్సయ్య (బస్సాపూర్, నిజామాబాద్), సీహెచ్.రాజిరెడ్డి (గుల్లకోట, జగిత్యాల) . అధ్యాపక విభాగం: డాక్టర్ ఎం.రమాదేవి (ప్రభుత్వ బీఈడీ కళాశాల (ఐఏఎస్ఈ), మాసబ్‌ట్యాంకు, హైదరాబాద్). ప్రత్యేక విభాగం: బి.శంకర్‌బాబు (బీహెచ్ఈఎల్, సంగారెడ్డి), జె.శ్రీనివాస్‌రెడ్డి (క్షీరసాగర్, సిద్దిపేట), ఎం.రాంప్రసాద్ (రంగదంపల్లి, సిద్దిపేట), టి.మధుసూదన్‌రావు (శాంతినికేతన్, హైదరాబాద్), వరకాల పరమేశ్వర్ (ఆదిభట్ల, రంగారెడ్డి), వై.లిల్లిమేరీ (తిమ్మంపేట, జనగామ), టి.సత్యనారాయణరెడ్డి (నర్సింహపురం, సూర్యాపేట), ఎం.వెంకటయ్య (పెన్‌పహడ్, సూర్యాపేట), సత్తులాల్ (గుండాల, కొత్తగూడెం), సముద్రాల శ్రీదేవి (పటాన్‌చెరు, సంగారెడ్డి).

## అర్హులందరికీ ఆసరా పెన్షన్లు

### హామీ ఇచ్చిన మంత్రి సబితా



రంగారెడ్డి,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆసరా పింఛన్లు అందిస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ జరుగుతోందని..పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరలో వారికి పింఛన్లు అందిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలో కొత్తగా 54వేల మందికి పింఛన్లు మంజూరయ్యాయని.. వారందరికి పింఛన్లు అందిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. లబ్దిదారులకు నూతన పింఛన్ కార్డులను పంపిణీ చేశారు. వయోవృద్ధులు, వితంతులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు నూతన పింఛన్ కార్డులను అందజేశారు. ఆసరా పెన్షన్లు అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీఎ÷-లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్ రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


## 200కోట్ల తో రాధాకృష్ణ మందిర నిర్మాణం

### స్థలం కేటాయించాలని మంత్రిని కోరిన ఇస్కాన్

హైదరాబాద్, **సెప్టెంబర్ 2 (సమ సమాజం):** ప్రభుత్వం భూమి కేటాయిస్తే అద్భుతమైన రాధామందిరం నిర్మిస్తామని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఇందుకోసం రూ. 200 కోట్లను ఖర్చుచేస్తామని అన్నారు. హైదరాబాద్ సమీపంలో రాధాకృష్ణ మందిరాన్ని నిర్మించాలని ఇస్కాన్ ప్రతిపాదించింది. 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన మందిరానికి భూమిని కేటాయించాలంటూ ఇస్కాన్ ప్రతినిధులు అరణ్య భవన్‌లో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్‌కు సమీపంలో సంగారెడ్డి జిల్లాలో సాధారణ ధరకు లీజు పద్ధతిలో అనువైన స్థలాన్ని కేటాయించాలని మంత్రిని కోరారు. ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, ఆయన ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుం టామని మంత్రి చెప్పారు. మందిర ప్రాంగణంలో గురుకులం, వృద్ధాశ్రామం, గోశాల కూడా నిర్మించ నునున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇస్కాన్ విశాఖనగర శాఖ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, ఇతర ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చలన చిత్రం

# హరిహర వీరమల్లు గ్లింప్స్
## ఆనందంలో పవన్ అభిమానులు




'అజ్ఞాతవాసి' తర్వాత రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్.. మూడేళ్ళ తర్వాత 'వకీల్ సాబ్'తో గ్రాండ్‌గా రీ ఎంట్రీ ఇచ్చాడు. గతేడాది విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించింది. ఈ చిత్రం తర్వాత 'భీమ్లా నాయక్'తో మరో సాలిడ్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఇలా వరుసగా రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లు రావడంతో పవన్ అభిమానుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ప్రస్తుతం 'హరి హర వీరమల్లు' అనే పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రాన్ని చేస్తున్నాడు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ షూటింగ్ జరుపకుంటుంది. తాజాగా ఈ చిత్ర నిర్మాత ఈ సినిమా షూటింగ్ ఇప్పటివరకు 50శాతం పూర్తయిందని తెలిపాడు. కాగా శుక్రవారం పవన్ కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా మేకర్స్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'మెడల్ని వంచి, కథల్ని మార్చి, కొలిక్కితెచ్చే పనెట్టుకొని తొడకొట్టాడే.. తెలుగోడు' అంటూ పవర్ ఫుల్ నేపథ్య సంగీతంతో 'హరి హర వీరమల్లు' గ్లింప్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. గ్లింప్స్‌లో పవన్ స్క్రీన్ ప్రజెన్స్ వేరే లెవల్లో ఉంది. కుస్తీలో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ పులిలా విజృంభిస్తున్నాడు. ముఖ్యంగా కీరవాణి నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంది. ఈ చిత్రంలో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్, నర్గీస్ ఫక్రి హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ. దయాకర్ రావు నిర్మిస్తున్నాడు. ఎమ్. ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. పీరియాడికల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.



## శ్రీవారిని దర్శించుకున్న నటి జాన్వీ కపూర్

తిరుమల శ్రీవారిని బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆమెను ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన జాన్వీ కపూర్ తో ఫోటోలు దిగ్గేందుకు భక్తులు ఆసక్తి చూపారు. జాన్వీ ప్రస్తుతం పలు బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.




## శర్వానంద్ ఒకే ఒక జీవితం

ట్రైలర్ విడుదలతో పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ ఇటీవలే ఈయన నటించిన 'ఆడవాళ్ళు మీకు జోహార్లు' భారీ అంచనాలతో విడుదలై బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈయన ఒక్క హిట్టు కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాడు. లేటెస్ట్‌గా శర్వా నటించిన 'ఒకే ఒక జీవితం' విడుదలకు సిద్ధంగా ఉంది. శ్రీకార్తిక్ దర్శకత్వం ఈ చిత్రం టైం ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ చేశాయి. మేకర్స్ తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. శర్వానంద్ ఏదో మ్యూజిక్ కాంపిటేషన్‌కు ప్రాక్టీస్ చేస్తున్నట్లు ట్రైలర్ ప్రారంభ మవుతుంది. అంతలోనే రీతూవర్మ 'కంగ్రాట్స్ ఆది.. ఫస్ట్ రౌండ్‌లో సెలెక్ట్ అయ్యావ్' అంటూ శర్వాతో పలికిన సంభాషణ ఆకట్టుకుంటుంది. అయితే కాంపిటేషన్‌లో శర్వా పాడలేక ఇబ్బంది పడుతుంటాడు. అసలు ఎందుకు ఇబ్బందిపడుతున్నాడనేది సినిమా చూస్తే తెలుస్తుంది. మ్యారేజ్ బ్రోకర్‌గా వెన్నెల కిషోర్ ట్రైలర్‌లో కనింపించాడు. ఇక ప్రియదర్శి తను ఎలాగైన ఒక పర్‌ఫెక్ట్ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటుంటాడు. 'ఏదేమైనా పెళ్ళి కరెక్ట్ టైంలోనే జరగాలిరా' అంటూ వెన్నెల కిషోర్ డైలాగ్‌తో నాజర్ ఎంట్రీ ఇస్తాడు. నాజర్ ఈ చిత్రంలో సైంటిస్ట్‌గా కనిపించనున్నాడు. టైం ట్రావెల్ మిషన్‌తో నాజర్ ఈ ముగ్గురుని వాళ్ళ బాల్యంలోకి పంపిస్తాడు. అసలు వీళ్ళ పాస్ట్‌లో ఏం జరిగింది? మళ్ళీ వీళ్ళు గతంలోకి ఎందుకు వెళ్ళాలని అనుకున్నారు? అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కినట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in